క్లుప్తంగా

మద్దతు ధర పెంపు హర్షణీయం

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర పెంచడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం రాకముందు వరికి క్వింటా ధర రూ.1400 ఉంటే మోదీ రాకతో నేడు రూ.2300లకు చేరిందని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఆదాయం రెట్టింపు చేయడం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, ఉప్పుల లింగయ్య, కత్తుల నరేష్ తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ హాజరవుతారని తెలిపారు.

బాదె రాముకు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బాదె రాము 5వ వర్ధంతిని బుధవారం రాత్రి జాజిరెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాము చిత్ర పటానికి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల సమస్యల సాధనకై అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి రాము అని అన్నారు. అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాడని తెలిపారు. రాము ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఎల్‌సీ నాయకుడు పోలెబోయిన పెదలింగయ్య, వడకాల బయ్యన్న, మధుకర్, సురేష్, విజయ్, వీరేష్, కృష్ణమూర్తి, రంగు వీరేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

అర్వపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ కులగణన చేపట్టాలని పూలే అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో నిలబెట్టుకోవాలని కోరారు. బీసీలు ఎంతమంది ఉన్నారనే విషయమై ఇప్పటి వరకు లెక్కలు తేల్చకపోవడం శోచనీయమన్నారు. కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, బి.తిరుపతి, గుండెబోయిన ఆంజనేయులు, రాంబాబు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే అభ్యాస దీపిక పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి. బాలు నాయక్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం 43 మంది పదవ తరగతి విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాలను అందజేశారు. గైడుల మాదిరిగా ఈ పుస్తకాలు పిల్లలకు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం వర్దెల్లి కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కోదాడరూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎల్‌పీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాణోతు బాబునాయక్ పిలుపునిచ్చారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎమ్మెస్ కళాశాలలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన తండాలను, గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని అన్నారు. మైదాన ప్రాంత ఎస్టీ గిరిజనుల కోసం ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనులు, ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, ఎస్ఎస్‌రావు, పంది తిరపయ్య, గంగధరరావు, వీరస్వామి, రహీం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

గృహజ్యోతి లబ్ధి కొందరికేనా..

- జాజిరెడ్డిగూడెం మండలంలో 6,700 గృహ కనెక్షన్‌లకు గాను 4 వేలకే వర్తింపు
- ఎడిట్ ఆప్షన్ సమస్యతో పథకానికి దూరమవుతున్న లబ్ధిదారులు
- అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని ప్రజల వేడుకోలు



మళ్లీ దరఖాస్తులు చేసుకోవడానికి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన అర్హులు



ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా గృహజ్యోతి వర్తించలేదని రశీదులు చూపుతున్న అర్హులు

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందడం లేదు. ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ సందర్భంగా జరిగిన తప్పిదాలు అర్హులపాలిట శాపంగా మారాయి. ప్రభుత్వం ప్రకటించిన మేరకు అన్ని అర్హతలు ఉన్నా 200యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశం చాలామంది కోల్పోయారు. ఆరు గ్యారంటీల పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గతేడాది డిసెంబర్ 8 నుంచి ఈఏడాది జనవరి 6 వరకు గ్రామ గ్రామాన ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. అయితే దరఖాస్తు పత్రాల్లో పథకాల లబ్ధి కోసం కేవలం టిక్ పెడితే చాలు అని చెప్పడంతో దరఖాస్తుదారులు అదే పని చేశారు. కాగా డేటా ఎంట్రీ నమోదులో కొన్ని పొరపాట్లను సరిచేసేందుకు నాట్ మ్యాచింగ్ ఆప్షన్ ఇవ్వడంతో సరిచేయగలుగుతున్నారు. అయితే నాట్ అప్లయ్ సమస్యతో అర్హత కోల్పోయిన దరఖాస్తుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ సమస్యతో లబ్ధిపొందలేకపోయిన వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయాల్లో సిబ్బంది ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. కాగా ఎడిట్ ఆప్షన్ ఇస్తే తప్ప తామేమి చేయలేమని అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో సుమారు 6,700 వరకు గృహవిద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. అయితే వీటిలో 4వేల వరకు కనెక్షన్‌లకు గృహజ్యోతి పథకం వర్తించింది. కాగా పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచి గృహజ్యోతి పథకం వర్తించని కొందరు అర్హులు కూడా తప్పని పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. అయితే ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి నిత్యం అనేక మంది గృహజ్యోతి పథకం కోసం వచ్చిపోతున్నారు. కాగా నాట్ మ్యాచింగ్ ఆప్షన్ వాటికి మాత్రమే సరిచేస్తున్నారు. అనేక మంది అర్హులు తమకెందుకు ఈ పథకం వర్తించడం లేదని కార్యాలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారు. ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో అర్హులైన వారికి ఏమి చెప్పాలో అర్థం కాక కార్యాలయ ఇబ్బంది పడుతున్నారు.

గృహజ్యోతి వర్తించలేదు



ప్రజాపాలనలో దరఖాస్తు చేశాను. రశీదు కూడా ఇచ్చారు. అయితే ఇంతవరకు గృహజ్యోతి పథకం వర్తించలేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తే నాట్ అప్లయ్ అని చెబుతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం రోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాను. ప్రతినెలా 100 యూనిట్లకు మించి విద్యుత్‌ను వాడుకోవడంలేదు.

– బందారి సోమశేఖర్, జాజిరెడ్డిగూడెం

మీటర్ నంబర్ వేయలేదంటున్నారు



ప్రజాపాలనలో ఉచిత కరెంట్ కోసం దరఖాస్తు చేశాను. అయితే రశీదు కూడా ఇచ్చారు. కానీ విద్యుత్ మీటర్ నంబర్ వేయలేదు. దీంతో కరెంట్ బిల్లు నెల నెలా వస్తోంది. అయితే అర్వపల్లిలో ఆఫీసుకు వెళ్లగా ఇంకా పైనుంచి దీనిపై మాకు ఏమిచెప్పడం లేదని అంటున్నారు. పథకం కోసం రోజుల తరబడి పని వదులుకొని తిరగాల్సి వస్తోంది.

– సైదుల మంగమ్మ, జాజిరెడ్డిగూడెం

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఐఏకేఎంఎస్ నాయకులు

తుంగతుర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులు నిర్మలకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల నేడు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. రైతులకు సరిపడ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధరను ముందే ప్రకటించాలని అన్నారు. అన్ని రకాల పంటలపై రూ.500ల బోనస్‌ను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, తడకమల్ల సంజీవ, చిప్పలపల్లి మధు, జిలకరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ తుంగతుర్తి డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ పి.అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు చీమల వెంకన్నయాదవ్ వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ తోటలను సాగుచేయాలని సూచించారు. ఆయిల్‌పాం పంటకు కూలీల ఖర్చులు ఉండవని తెలిపారు. కోతుల బెడద కూడా ఉండదని పేర్కొన్నారు. ఆయిల్‌పాం పంట నాటు కుంటే 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. పంట నాటిన నాలుగవ సంవత్సరం నుంచి పంట కోత మొదలై ప్రతి నెలా 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే కొనుగోలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ క్షేత్ర సహాయకులు రంగు ముత్యం రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు మంచి స్పందన



మాజీ సర్పంచ్ కుంభం ఉషారాణి కుమార్తెకు అడ్మిషన్ ఇస్తున్న ఎంఈఓ బాలునాయక్

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు పిల్లల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోందని మండల విద్యాశాఖ అధికారి బి.బాలునాయక్ చెప్పారు. జాజిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు కుమార్తె మోక్షను గురువారం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు కొత్తగా 33 అడ్మిషన్లు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, మంజుల, ఇందిర, ఉమ, ప్రసన్నకుమారి, రాజ్యలక్ష్మి, రజని, పీడీ సోమయ్య, యాదగిరి, వెంకటేశ్వర్లు, లింగస్వామి, వీరప్రసాద్, వెంకట్, చంద్రకళ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలపై దాడులను నివారించాలి



ఎంపీ రఘువీర్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్డీఆర్‌ను కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు

భానుపురి : గ్రామీణ వైద్యులపై జాతీయ మెడికల్ కౌన్సిల్ నిర్వహిస్తున్న దాడులను నివారించాలని సూర్యాపేట జిల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య, జనరల్ సెక్రటరీ పాలిశెట్టి రాజేందర్ అన్నారు. గురువారం సూర్యాపేటకు వచ్చిన నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిలను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎలాంటి నోటీసులు లేకుండా దాడులు నిర్వహిస్తూ గ్రామీణ వైద్యాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని, ఈ విషయమై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత కాంగ్రెస్ పాలనలో గ్రామీణ వైద్యులకు 1273 జీఓ ద్వారా శిక్షణ ఇచ్చినప్పటికీ నేటి వరకు సర్టిఫికెట్లు అందజేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీసీసీ సభ్యుడు సర్వోత్తం రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణా రెడ్డి, ఆర్‌ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రహమతుల్లా, ఎల్లె వెంకటేశ్వర్లు, చిలువేరు చంద్రయ్య, జరిపోతుల లక్ష్మణగౌడ్, రాజబాబు, ఎస్.కె నాగుల్‌మీరా, వెంకన్న, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటిని అందించాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన జాజిరెడ్డిగూడేనికి ఇంతవరకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని చెప్పారు. కొన్ని ఇళ్లకు ఇంత వరకు నల్లా కనెక్షన్లు కూడా ఇవ్వలేదని తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఇంటింటికీ సర్వేకు వచ్చిన అధికారులకు కూడా ఈ విషయాన్ని తెలయజేశామని పేర్కొన్నారు.

వన నర్సరీలో మొక్కల పరిశీలన



అడివెంలలో వననర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ ఉపేందర్, ఈసీ నగేష్

అర్వపల్లి : తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. గురువారం మండల పరిధిలోని అడివెంల గ్రామ వనన ర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ విడత హరితహారంలో జాజిరెడ్డిగూడెం మండలంలో 1,42,744 మొక్కలను నాటాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా పడగానే మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకు గంగ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- వరుణుడి కోసం ఎదురుచూపు
- చివ్వెంల మండలంలోని 31 జీపీల్లో 3.10 లక్షల మొక్కల పెంపకం



చివ్వెంలలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

చివ్వెంల : గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. హరితహారంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభమైతే ఈ నెలాఖరు వరకు లేదా జూలైలో మొక్కలు నాటేందుకు ఆయా గ్రామ పంచాయతీల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కలు..

చివ్వెంల మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కల చొప్పున మొత్తం 3.10 లక్షల మొక్కలను పెంచారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా బోర్ల ద్వారా, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించారు. మొక్కలు ఎండకు ఎండిపోకుండా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

వివిధ రకాల మొక్కలు..

ఆయా గ్రామపంచాయతీ పరిధిల్లోని నర్సరీల్లో పండ్ల, పూల మొక్కలు, అటవీ మొక్కలు పెంచుతున్నారు. జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, వంటి మొక్కలతోపాటు గులాబీ, మందారం, మల్లె పూల మొక్కలను పెంచుతున్నారు. వాటితోపాటు రోడ్లకు ఇరువైపులా నాటేందుకు వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గతంతో పోల్చితే ఈ సారి ప్రజలకు అవసరమయ్యే వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

వర్షాలు పడితే మొక్కలు నాటుతాం

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. వాటిల్లో ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాం. అన్ని నర్సరీల్లో ప్రస్తుతం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల

మోతె మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె : ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో మోతె మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు అందుతున్నాయా.. లేదా అనే విషయంపై రెండు రోజుల్లో నివేదిక అందించాలని ఎంపీడీఓను ఆదేశించారు. మండలంలో పెండింగ్ పనుల వివరాలు తనకు తెలపాలన్నారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. నామవరంలో శిథిలావస్థలో ఉన్న పశువైద్య ఉప కేంద్రం నిర్మాణానికి ఎస్టిమేషన్ వేసి నివేదిక అందించాలన్నారు. విద్యుత్ ఏఈ రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఏఈని హెచ్చరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీటీసీలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, జెడ్పీటీసీ పుల్లారావు, ఆర్డీఓ, తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో ఎదుగుదల



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకటరమణ



తిరుమలగిరి : అనంతారం మోడల్ స్కూల్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



అర్వపల్లిలోని కేజీబీవీలో బాలికలకు మాత్రలు వేస్తున్న డాక్టర్, ఎస్ఓ



పెన్‌పహాడ్ : కస్తూరిబా పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

నాగారం : విద్యార్థులలో శారీరక, మానసిక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ మాత్రలను 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.మల్లయ్య, మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, ఏఎన్ఎం నాగమ్మ, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, ఆశకార్యకర్తలు రేణుక, రోజా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రతి ఆరు నెలలకు ఒకసారి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పి.వెంకటరమణ అన్నారు. గురువారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని మల్లెల వందన, సీహెచ్ఓ బిచ్చు నాయక్, నర్సింహారెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

అనంతారం మోడల్ స్కూల్‌లో..

1–19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు అన్నారు. శనివారం అనంతారం మోడల్ స్కూల్‌లో, తొండ ప్రాథమిక పాఠశాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, వైద్యాధికారిని మల్లెల వందన, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, మండల విద్యాధికారి శాంతయ్య, సీహెచ్ఓ బిచ్చునాయక్, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి, ప్రిన్సిపాల్ బాలరాజు పాల్గొన్నారు.

జిల్లాలో 2,13,215మంది పిల్లలకు..

అర్వపల్లి : నులి పురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా జిల్లాలో 2,13,215 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వ్యాధి నిరోధక టీకాల జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ చెప్పారు. అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యాసంస్థలతో పాటు ఇంటింటికీ తిరిగి ఈ నెల 27 వరకు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.మణిదీప్, హెచ్ఎం ఎం.విజయలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి, చిగుర్ల నర్సయ్య, ఎంపీహెచ్ఏ వీరయ్య, పీఈటీ లింగాల రవి, ఆశా కార్యకర్త ఎం.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలోని కేజీబీవీలో..

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వపల్లిలోని కేజీబీవీలో బాలికలకు మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్ మాత్రలు వేశారు. ఈ నెల 27 వరకు మాత్రల పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి నాగరాణి, ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్త స్వరూప, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : పౌష్టికాహారం తీసుకున్నట్లయితే నులిపురుగులను అరికట్టవచ్చని మండల వైద్యాధికారి స్రవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నకిరేకంటి రవి, ఎంపీఓ నరేష్, ఎస్ఓ ఆసియా బేగం, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, హెచ్ఈఓ చంద్రశేఖరరాజు, పంచాయతీ కార్యదర్శి శివ, ఏఎన్ఎం వీరమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : పిల్లల ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి, ఎంపీఓ భీంసింగ్, హెచ్ఈఓలు సముద్రాల సూరి, రవి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, పీహెచ్ఎన్ సైదమ్మ, జానకమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులలో నులిపురుగుల నివారణతో రక్త హీనతను అరికట్టవచ్చునని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం నెమ్మికల్లులో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వీరేంద్రనాథ్, సూపర్‌వైజర్ రంగమ్మ, పూలమ్మ, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, వైద్యాధికారి జి.భవాని, హెచ్ఎం కళారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శిరోమణి, ఏఎన్ఎం భిక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్లు : విద్యార్థులలో నులిపురుగుల నివారణతో రక్త హీనతను అరికట్టవచ్చని ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంఈఓ రాములు నాయక్, మండల వైద్యాధికారి అక్షితారెడ్డి, ఎంపీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : నులిపురుగుల కారణంగా పిల్లలలో శారీరక ఎదుగుదల మందగిస్తుందని జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్ అన్నారు. గురువారం జి.కొత్తపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నగేష్, ఏఎన్ఎం పల్లవి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జి.కొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో..



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్లులో..



చివ్వెంలలో..

పంచాయతీ కార్యదర్శి మృతి

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన జోగునూరి జిందగిరి(41) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. జిందగిరి ఇటీవల గుండెపోటుకు గురి కావడంతో పెరాలసిస్ వచ్చింది. దీంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని మృతి చెందాడు. జిందగిరి మృతిపట్ల ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేశారు. ఫణిగిరి జీపీ సిబ్బంది ఆధ్వర్యంలో మృతుడి స్వగ్రామమైన రావులపల్లిలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పంచాయతీ కార్యదర్శులు వీరేందర్, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

మునగాల : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వంగవేటి వెంకటగురుమూర్తి పుట్టినరోజు సందర్భంగా గురువారం మునగాల మండలం గణపవరంలోని జెడ్పీ పాఠశాలకు వాసవీ క్లబ్ మునగాల శాఖ ఆధ్వర్యంలో ఫర్నిచర్ అందజేశారు. అనంతరం వెంకటగురుమూర్తిని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.